


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL    ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి    ఆదివారం 19 డిసెంబరు 2021    సంపుటి : 03    సంచిక : 116    పేజీలు : 4    వెల : రూ 3-00


## త్వరలో అత్యాధునిక రాష్ట్రంగా ఉత్తర ప్రదేశ్ : మోదీ



లక్నో : డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నిర్మిస్తున్న ఆధునిక మౌలిక సదుపాయాల వల్ల ఉత్తర ప్రదేశ్ త్వరలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా గుర్తింపు పొందుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. షాజహాన్‌పూర్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేకు శనివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు. తదుపరి తరం మౌలిక సదుపాయాలతో అత్యాధునిక రాష్ట్రంగా ఉత్తర ప్రదేశ్ గుర్తింపు పొందడం ఎంతో దూరంలో లేదని మోదీ చెప్పారు. రాష్ట్రంలోని ఎక్స్‌ప్రెస్‌వేల నెట్‌వర్క్, నిర్మితమవుతున్న నూతన విమానాశ్రయాలు, రైలు మార్గాలు ప్రజలకు అనేక వరాలను తీసుకొస్తున్నాయని తెలిపారు. మీరట్, హాపూర్, బులంద్‌షహర్, అమ్రోహా, సంభల్, బడౌన్, షాజహాన్‌పూర్, హర్దోయి, ఉనవ్, రాయ్‌బరేలీ, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్ ప్రజలను అభినందించారు. 600 కిలోమీటర్ల నిడివిగల ఈ ఎక్స్‌ప్రెస్‌వే కోసం రూ.36,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తామని తెలిపారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే వల్ల ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతాయని తెలిపారు. వేలాది మంది యువతీయువకులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతేకాకుండా నరికొత్త అవకాశాలు కూడా చేరువవుతాయని చెప్పారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే వల్ల ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని, గొప్ప సదుపాయంగా ఉంటుందని తెలిపారు. వీటన్నిటి ఫలితంగా సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని, రాష్ట్ర వనరులు సద్వినియోగమవుతాయని చెప్పారు. రాష్ట్రంలో నేడు ఆధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం జరుగుతోందని, వనరులు ఏవిధంగా సద్వినియోగమవుతున్నాయో ప్రజలు చూస్తున్నారని, గతంలో వనరులను ఎలా ఉపయోగించేవారో కూడా చూశారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మితమవుతుంది. దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. దీనిలో 3.5 కిలోమీటర్ల ఎయిర్ స్ట్రిప్ కూడా ఉంది. అత్యవసర సమయంలో భారత వాయు సేన విమానాలు ఇక్కడ దిగి, ఇక్కడి నుంచి బయల్దేరడానికి అవకాశం ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే వద్ద ఓ పారిశ్రామిక నడవను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# అభివృద్ధి వికేంద్రీకరణపై తిరుపతిలో భారీ బహిరంగ సభ



తిరుపతి: అభివృద్ధి అధికార వికేంద్రీకరణ నినాదాలతో తిరుపతి మారుమ్రోగింది. ఒక రాజధాని వద్దు మూడు రాజధానులు ముద్దు అంటూ మేధావులు విద్యార్థి సంఘాల నేతలు మహిళలు పెద్ద ఎత్తున నినదించారు. మూడు రాజధానులు మద్దతుగా శనివారం.. తిరుపతి ఇందిరా మైదానంలో బహిరంగ సభ జరిగింది. ఈ సభకు వేలాదిగా తరలివచ్చారు. రాయలసీమ వాసులే కాకుండా ఉత్తరాంధ్ర అమరావతి ప్రాంతాల నుంచి వచ్చిన మేధావులు వివిధ వర్గాలకు చెందిన నేతలు తమ గొంతును వినిపించారు. అభివృద్ధి అన్నది ఒకే ప్రాంతానికి పరిమితమయితే మిగతా ప్రాంతాలు తీవ్రంగా నష్టపోతాయని స్పష్టం చేశారు.రాయలసీమ మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. అమరావతిలోనే రాజధాని ఉండాలని చేసి డిమాండ్ తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సభలో ప్రసంగించిన మేధావులు విద్యార్థి సంఘాల నేతలు స్పష్టం చేశారు. ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా సమగ్రాభివృద్ధి బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. దీంతో వేలాది మంది చేతులు పైకెత్తి తమ హర్షం ప్రకటించారు.పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానుల ఏర్పాటు డిమాండ్, రాయలసీమ అవసరాలు, ప్రభుత్వం నుంచి సాధించాల్సిన హక్కుల కోసం తిరుపతిలోని ఇందిరా మైదానంలో నిర్వహించిన ప్రజా రాజధానుల మహాసభ కొనసాగుతోంది. రాయలసీమ అభివృద్ధి సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ మహాసభలో సీమ అభివృద్ధిని ఆకాంక్షించే అన్ని సంఘాలు పాల్గొన్నాయి.రాయలసీమ అధ్యయన సంస్థ అధ్యక్షులు భూమన్ మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీ అమరావతి నినాదం ఎత్తుకొందని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని అది జరగాలంటే ఉత్తరాంధ్ర, రాయల సీమల్లోనూ రాజధానుల ఉండాలని తెలిపారు. మూడు రాజధానులకు మద్దతుగా తిరుపతిలో రిలేదీక్షలు చేపడతామని చెప్పారు. వికేంద్రీకరణ సాధన కోసం మహా పాదయాత్రకు సిద్ధమవుతామని తెలిపారు.చిత్తూరు, కడప, కర్నూల్. అనంతపురం జిల్లాల నుంచి ప్రతినిధులు మేధావులు హాజరయ్యారు. రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్ (తిరుపతి), రాయలసీమ మహాసభ అధ్యక్షుడు, రచయిత శాంతి నారాయణ (అనంతపురం), రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి (కడప), కుందూ పోరాట సమితి అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి (కర్నూల్) పాల్గొన్నారు.

## వికేంద్రీకరణకు మద్దతుగా 'చైతన్యయాత్ర'

**అధికార వికేంద్రీకరణ కోసం ఏపీ వ్యాప్తంగా ఉద్యమం**

**జనవరిలో శ్రీశైలం నుంచి అమరావతి వరకు చైతన్యయాత్ర**

**రాయలసీమ హక్కుల నేతలు**



తిరుపతి: అధికార వికేంద్రీకరణ కోసం ఏపీ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని రాయలసీమ హక్కుల నేతలు వెల్లడించారు. జనవరిలో శ్రీశైలం నుంచి అమరావతి వరకు చైతన్య యాత్ర చేస్తామన్నారు. ప్రతి ప్రాంతంలోని విశ్వ విద్యాలయాల్లో సదస్సులు నిర్వహిస్తామని రాయలసీమ హక్కుల నేతలు భూమన్, చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.అమరావతిలోనే రాజధాని ఉండాలనుకోవడం దుర్మార్గమన.. దీనివల్ల మిగతా ప్రాంతాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా ప్రతి ఒక్కరినీ కలుపుకునిపోతామన్నారు. చంద్రబాబు, నారాయణ, రామకృష్ణ రాయలసీమ ద్రోహులని మండిపడ్డారు. త్వరలో వీళ్ల బండారం ప్రజల వద్ద బట్టబయలు చేస్తామని భూమన్, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.


## సీఎం జగన్ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు: అశోక్ బాబు

అమరావతి: మూడు రాజధానులతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందంటున్న సీఎం జగన్ మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని టీడీపీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడు రాజధానుల బిల్లుని కోర్టులో వెనక్కుతీసుకోవడమే..సీఎం, వైసీపీ ప్రభుత్వ పరాజయానికి సంకేతమన్నారు. సీఎం జగన్‌రెడ్డి అమరావతి నుంచి ఇటుకను కూడా..తీసుకెళ్లలేరన్న సందేశాన్ని అమరావతి మహోద్యమసభ చాటిందని అశోక్‌బాబు తెలిపారు.



## అగ్నిప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం

బాలాసోర్ డిసెంబర్ 18 న్యూస్);: అగ్ని ప్రైమ్ క్షిపణిని ఇవాళ విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని బాలాసోర్ వద్ద ఈ మిస్సైల్‌ను పరీక్షించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అగ్ని-పీ మిస్సైల్ కొత్త జనరేషన్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ వేరియంట్. అగ్ని ప్రైమ్ క్యానిస్టర్ మిస్సైల్. దీని సామర్థ్యం 1000 నుంచి 2000 కిలోమీటర్ల దూరం. అగ్ని ప్రైమ్‌కు అణ్వాయుధాలు మోసుకువెళ్లే సామర్థ్యం ఉన్నది. అగ్ని క్లాస్‌కు చెందిన ఈ మిస్సైల్‌లో అనేక కొత్త ఫీచర్లను జోడించారు. అత్యంత కచ్చితత్వంతో మిషన్ లక్ష్యాలను చేరుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఇవాళ ఉదయం 11.06 నిమిషాలకు డీఆర్డీవో ఈ పరీక్ష చేపట్టింది. అగ్రి ప్రైమ్ క్షిపణి పరీక్ష సమయంలో.. టెలిమెట్రీ, రేడార్, ఎలక్ట్రో ఆప్టికల్ స్టేషన్స్, డౌన్‌రేంజ్ షిప్స్‌ను తూర్పు తీరం వద్ద ట్రాక్ చేశారు. అనుకున్నట్లే క్షిపణి ట్రాజెక్టరీ సాగిందని డీఆర్డీవో చెప్పింది. హై లెవల్ అక్యురెసితో అన్ని అబ్జెక్టివ్‌లను అందుకున్నట్లు డీఆర్డీవో వెల్లడించింది. అగ్ని ప్రైమ్ క్షిపణి.. రెండ దశల సాలిడ్ ప్రొపెల్లెంట్ బాలిస్టిక్ మిస్సైల్. డ్యుయల్ నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. మిస్సైల్‌లో ఉన్న అన్ని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలు సెకండ్ ఫ్లయిట్ టెస్ట్‌లో సరైన రీతిలో స్పందించినట్లు డీఆర్డీవో చెప్పింది.విజయవతంగా అగ్ని ప్రైమ్ మిస్సైల్‌ను పరీక్షించినందుకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కంగ్రాట్స్ చెప్పారు. క్షిపణి అద్భుతమైన రీతిలో పనిచేసినందుకు ఆయన అత్యంత సంతోషాన్ని వ్యక్తం చేశారు. మిస్సైల్ పరీక్షలో పాల్గొన్న బృందానికి డీఆర్డీవో చైర్మెన్ డాక్టర్ జీ సతీశ్ రెడ్డి ప్రశంసలు తెలిపారు.



## అయ్యన్న సవాల్‌కు ప్రభుత్వం, సీఐడీ సిద్ధమా?: పట్టాభి



విశాఖ: ఏపీని మూడు ముక్కలు చేస్తే ప్రజలు సహించరని టీడీపీ నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ పార్టీ నేత పట్టాభి అన్నారు. కొందరు పోలీసుల తీరు వ్యవస్థకే చెడ్డపేరు తెస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సీఐడీ అంటే చిత్తం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్‌గా మారిపోయిందన్నారు. రాజధాని పేరిట విశాఖలో వైసీపీ నేతలు భూ దందా చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖలో రాజన్న రియల్ ఎస్టేట్ కంపెనీని తెరిచారని ఎద్దేవా చేశారు. విశాఖ ప్రజలు తమకొద్దీ పులివెందుల రాజకీయాలు అంటున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ అధికారులపై కక్షసాధింపులకు దిగారని పట్టాభి ఆరోపించారు. ఫిజికల్ వెరిఫికేషన్ లేకుండా అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. అయ్యన్న సవాల్ స్వీకరించేందుకు ప్రభుత్వం, సీఐడీ సిద్ధమా? అని పట్టాభి సవాల్ విసిరారు.

## మద్యంపై వ్యాట్‌ను క్రమబద్ధీకరించిన ఏపీ సర్కార్



విజయవాడ: మద్యంపై వ్యాట్‌ను ఏపీ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వ్యాట్‌తో పాటు స్పెషల్ మార్జిన్, అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ సవరిస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గనున్నాయి. బీర్లపై వ్యాట్ 10 నుంచి 20 శాతం తగ్గనుంది. స్పెషల్ మార్జిన్ 36 శాతం, అడిషనల్ ఎక్సయిజ్ డ్యూటీ 36 శాతం తగ్గనుంది. మొత్తంగా బీర్లపై 20 నుంచి 30 రూపాయల వరకు తగ్గే అవకాశం ఉంది.ఐఎంఎల్ లిక్కర్‌పై వ్యాట్ 35 నుంచి 50 శాతం తగ్గనుంది. స్పెషల్ మార్జిన్ 10 నుంచి 20 శాతం, అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ 5 నుంచి 26 శాతం తగ్గనుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం అడ్డుకట్ట వేసేందుకు వ్యాట్ క్రమబద్దీకరించినట్లు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ తెలిపారు.


## అమరావతే రాజధాని... కేంద్రం ఒప్పుకుంది: జీవీఎల్



అనంతపురం: ఏపీ రాజధాని అమరావతేనని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని ఒప్పుకుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకుపోయారని విమర్శించారు. రెండు దశాబ్దాలుగా చేసిన అప్పులకంటే వైసీపీ రెండున్నరేళ్ల పాలనలోనే రెట్టింపు అప్పులు చేశారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ. 25800 కోట్లు ఖర్చు చేసిందని జీవీఎల్ తెలిపారు.రాష్ట్రంలో మూడు కారిడార్‌లు, 5 పారిశ్రామిక నగరాల అభివృద్ధికి 80 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర వాటా నిధులు ఇప్పటికీ మంజూరు చేయలేదని ఆయన విమర్శించారు. ఉపాధిహామీ పథకానికి దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులను ఏపీకి కేంద్రం ఇచ్చిందని తెలిపారు. కృష్ణా, గోదావరి బోర్డుల ఏర్పాటుకు డీపీఆర్‌లు ఇవ్వాలని కోరినా.. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదని తప్పుబట్టారు. ఈ ఏడాదిలోనే రెవెన్యూలోటు పూడ్చడంలో భాగంగా రూ.11,600 కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తున్నా... జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని దివాలా స్థాయికి తీసుకెళ్లారని జీవీఎల్ నరసింహారావు ఆరోపించారు.

## ఏపీలో కొత్తగా 137 కరోనా కేసులు

అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై వైద్యాధికారులు బులెటిన్ విడుదల చేశారు. ఏపీలో కొత్తగా 137 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనాతో ఒకరు మృతి చెందారు. ఇప్పటివరకు ఏపీలో మొత్తం 20,75,683 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనాతో మొత్తం 14,478 మరణాలు సంభవించాయి. ఏపీలో 1,705 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి 20,59,500 మంది రికవరీ చెందారు.



# సంపాదకీయం

ఆదివారం 19 డిసెంబరు 2021

## భారత్, రష్యా, చైనా కూటమి..?

భారత్ లో పర్యటించిన రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ .. ఇప్పుడు చైనాను మన దేశానికి దగ్గరచేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా త్వరలో భారత్–చైనా–రష్యా అధినేతలైన ప్రధాని మోడీ, జిని పింగ్, పుతిన్ మధ్య త్రైపాక్షిక భేటీ జరగబోతోందని రష్యా సంకేతాలు ఇచ్చింది. భారతదేశం, చైనా, రష్యా నాయకుల త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశం సమీప భవిష్యత్తులో జరుగుతుందని మాస్కోలో అధ్యక్షుడు పుతిన్ ఉన్నత సలహాదారు తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌పై మీడియాకు ఆయన వివరాలు వెల్లడించారు. ఇందులో అధ్యక్షుడు పుతిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్, ఇద్దరు నాయకులు భారతదేశంపై త్రైపాక్షిక చర్చలు జరగనున్నట్లు చెప్పారు. పుతిన్ డిసెంబరు 6న ఢిల్లీని సందర్శించారు, ఆ సమయంలో ఆయన ప్రధాని మోడీతో వన్ టూ వన్ భేటీ అయ్యారు. మాస్కోకు తిరిగి వచ్చిన తర్వాత ఆయన.. చైనా అధినేత జిన్ పింగ్ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతేడాది కాలంగా వాస్తవాధీన రేఖ వెంబడి భారత్, చైనా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సమావేశం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రాంతీయ, గ్లోబల్ 'హాట్‌స్పాట్‌లపై చర్చిస్తూ పుతిన్ పర్యటన సందర్భంగా చైనా అంశం చర్చకు వచ్చిందో లేదో భారతదేశం ఇంకా ధృవీకరించలేదు. వాస్తవాధీన రేఖ వద్ద ఉద్రిక్తతల నేపథ్యంలో నేతల స్థాయిలో ఇంకా సమావేశం జరగనప్పటికీ, త్రైపాక్షిక స్థాయిలో అధికారుల స్థాయి భేటీ మాత్రం జరిగింది. 2019లో జీ20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పుతిన్, మోదీ, జిన్ పింగ్ సమావేశమయ్యారు. ఇది గల్వాన్ ఘర్షణలకు ముందు జరిగింది. ఆ తర్వాత భారత్, చైనా ఘర్షణలు మరింత పెరిగాయి. ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన 21వ భారత రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం ఫలవంతం కావడం ఒక మంచి పరిణామం. చైనాతో, పాకిస్తాన్‌తో ముఖ్యంగా లడఖ్, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో చైనాతో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన పరిస్థితుల్లో చిరకాల మిత్రుడు రష్యా మనకు మరింత చేరువకావడం మన భద్రతకు, ప్రగతికి హామీ ఇస్తుంది. తన నుంచి భారీ ఎత్తున ఆయుధాలు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రష్యా మనతో బంధాన్ని గట్టిపరచుకోడం పట్ల ఆసక్తి చూపడం సహజమే. కాని సోవియట్ల కాలంలో దానితో మన బంధానికి గల ఘనమైన చరిత్రను దృష్టిలో వుంచుకొని చూసినప్పుడు ఈ మైత్రి ఇలా వర్ధిల్లడం మన రెండు దేశాల శ్రేయస్సుకే కాకుండా ప్రపంచ శాంతికి కూడా దోహదపడుతుందని ఆశించవచ్చు. ఆంక్షల అస్త్రాన్ని మనపై ప్రయోగిస్తానంటూ అమెరికా అభ్యంతరం చెబుతున్నప్పటికీ దానిని ఖాతరు చేయకుండా రష్యా నుంచి ఎస్ 400 క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు మనం సిద్ధం కావడం ప్రధాని మోడీ ప్రభుత్వ ఆచరణాత్మక వైఖరిని ప్రతిబింబిస్తున్నది. పుతిన్ న్యూఢిల్లీ యాత్ర సందర్భంగా మొదటి సారిగా జరిగిన భారత, రష్యా రక్షణ, విదేశాంగ మంత్రుల సమావేశంలో ఎస్ 400ల విక్రయానికి మనం చొరవచూపడం పట్ల రష్యా విదేశాంగ మంత్రి సిర్గిలావ్రోవ్ హర్షం ప్రకటించారు. భూతలం నుంచి ఆకాశానికి ప్రయోగించే రష్యన్ ఎస్ 400 క్షిపణులు దారిలో వున్నాయని 10 రోజుల్లో ఇక్కడికి చేరుకుంటాయని తెలుస్తున్నది. వీటిని రష్యా నుంచి కొనుగోలు చేస్తే ఆంక్షలు విధిస్తామని అమెరికా హెచ్చరించి వున్నది. ఈ క్షిపణులు భారత వైమానిక దళం శక్తిని పెంచే 'బూస్టర్ డోస్'ల వంటివని భారత వైమానికదళ మాజీ చీఫ్ బిఎస్ ధనోవా గతంలో అభివర్ణించారు. ఫ్రాన్స్ నుంచి రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్న భారత్ రష్యా నుంచి ఎస్ 400 క్షిపణులను సంపాదించుకోడాన్ని తప్పు పట్టవలసిందేముంది? అలాగే అమెరికా నుంచి 2020లో గరిష్ఠ స్థాయిలో ఆయుధాలు కొనుగోలు చేసిన దేశాల్లో ఇండియా అగ్ర భాగాన వుంది. దాని నుంచి మనం కొనుగోలు చేసిన ఆయుధాల విలువ 2019లో కేవలం 6.2 మిలియన్ల డాలర్లు కాగా అది 2020లో 3.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. సౌదీ అరేబియా, ఇరాక్, దక్షిణ కొరియా వంటి దేశాలు అమెరిక్ ఆయుధాల కొనుగోలును భారీగా తగ్గించి వేసిన సమయంలో ఆ లోటును పూరించడంలో ఇండియా, మొరాకో, పోలండ్ వంటి దేశాలు తోడ్పడ్డాయి. అందుచేత తనకు ప్రయోజనకరమనిపించినప్పుడు ఏ దేశం నుంచైనా రక్షణ, తదితర కొనుగోళ్లు చేసే స్వాతంత్ర్యాన్ని భారత్ కాపాడుకోగలగడాన్ని మెచ్చుకోవాలి. అయితే ఇరుగుపొరుగులతో మెరుగైన సఖ్యతను సాధించుకోలేకపోడం వల్లనే సరిహద్దుల భద్రతపైనా, ఆయుధాల కొనుగోళ్ల పైనా మనం అమితంగా ఖర్చు పెట్టవలసి వస్తున్నది. ఇది దేశ ప్రజల ముందడుగును, దేశ ప్రగతిని హరించి వేస్తున్నది. 2020 వేసవి నాటి నుంచి మనతో గల సరిహద్దుల్లో చైనా సేనల మోహరింపును భారీ స్థాయిలో పెంచివేయడం వల్ల మనకు ఎదురవుతున్న సవాలును రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రష్యాతో మంత్రుల స్థాయి సమావేశంలో వివరంగా ప్రస్తావించినట్టు వార్తలు చెబుతున్నాయి. అందుచేత ప్రత్యక్ష యుద్ధాల్లో ఉపకరించే సాంకేతికతల కోసం రష్యాతో సన్నిహిత సహకారాన్ని భారత్ కోరుకుంటున్నట్టు ఆయన వెల్లడించినట్టు సమాచారం. రూ. 5000 కోట్ల విలువైన 6 లక్షల 10 వేల ఎకె 203 రైఫిళ్లను కూడా రష్యా నుంచి మనం కొంటున్నాము. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ వద్ద కోర్వాలో ఇండో రష్యన్ రైఫిల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో వీటిని తయారు చేయదలిచారు. దీనికి సంబంధించిన ఒప్పందం పైనా, పదేళ్ల సైనిక సాంకేతిక సహకార అంగీకారం మీద సంతకాలు జరిగాయి. ఉగ్రవాదులు లేని, టెర్రరిజానికి మద్దతు ఇవ్వని, స్త్రీల హక్కులను కాలరాయని దేశంగా అఫ్ఘానిస్తాన్ రూపొందాలనడంలో భారత్, రష్యాలు ఏకీభావాన్ని ప్రకటించాయి. అదే సమయంలో అమెరికాతో కలిసి దక్షిణ చైనా సముద్రంలో చైనా ప్రాబల్యాన్ని నిరోధించడానికి ఉద్దేశించిన ఇండో పసిఫిక్ ఒప్పందం లో భారత్ భాగస్వామ్యం కావడాన్ని, అలాగే చైనాకు వ్యతిరేకంగా ఆస్ట్రేలియాలో అణుజలాంతర్గాముల తయారీకి అమెరికా కుదుర్చుకున్న 'ఆకస్' విషయంలోనూ రష్యా అసంతృప్తి వెల్లడించినట్టు బోధపడుతున్నది. క్వాడ్‌లో భారత్ పాత్రను రష్యా హర్షించేలా చూడడానికి చర్చల్లో మన మంత్రులు విఫలయత్నం చేసినట్టు వార్తలు చెబుతున్నాయి. మన సరిహద్దుల్లో చైనా దురహంకార సైనిక విస్తరణ పట్ల మన ఆందోళనను రష్యా అర్థం చేసుకొని వుండవచ్చు.

# కర్నూలు మిర్చికి మంచి రోజులు



కర్నూలు, డిసెంబర్ 18, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా మిర్చి రైతులకు మంచిరోజులు వచ్చాయి. పంట అమ్ముకోవడానికి ఇక దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రోజుల తరబడి నిరీక్షించాల్సిన అగత్యమూ తప్పింది. నంద్యాలలో త్వరలోనే మిర్చి యార్డు ఏర్పాటు కానుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ర్నూలు జిల్లాలో మిర్చి ఎక్కువగా పండించే ప్రాంతం నంద్యాల డివిజన్. ఇక్కడ పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు గుంటూరు మిర్చి యార్డును ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లిన తర్వాత పంటను అమ్ముకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు చేస్తే రైతులకు అన్ని రకాలుగా ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తీసుకునివెళ్లారు. దీనికి స్పందించిన సీఎం నంద్యాలలో మిర్చియార్డు ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ కార్యదర్శి ప్రద్యుమ్నకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటు అధికారులు పూర్తిస్థాయిలో కసరత్తు చేశారు. నంద్యాల పట్టణంలోని 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న టెక్కె మార్కెట్‌యార్డులో యార్డును ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్, హార్టికల్చర్ అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి పంట కొనుగోలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం రైతులు, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు, వ్యాపారులతో 2 విడతలుగా సమావేశాలు నిర్వహించారు. అంతేకాకుండా పంటను కొనుగోలు చేసే వారికి లైసెన్స్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. గుంటూరు మిర్చి యార్డులో ఐటీసీ సంస్థ ఎక్కువగా పంటను కొనుగోలు చేస్తోంది. ఆ సంస్థ అధికారులతో కూడా మార్కెటింగ్ శాఖ అధికారులు మాట్లాడారు. నంద్యాల యార్డులో పంటలు కొనుగోలు చేసేందుకు వారు ముందుకు వచ్చినట్లు సమాచారం. 34వేల హెక్టార్లలో మిర్చి సాగవుతుండగా ఏటా 2లక్షల టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. ఈ పంటను నిల్వ ఉంచడానికి తగినంత కోల్డ్ స్టోరేజ్‌లు లేవు. నంద్యాలలో 10, కోవెలకుంట్లలో 2, మహానందిలో 3, ఓర్వకల్లులో 2, నందికొట్కూరులో 1, ఆళ్లగడ్డలో 1..మొత్తం 19 కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం లక్ష టన్నులకు మించి లేదు. దీంతో వ్యాపారులు గుంటూరు జిల్లాను ఆశ్రయించాల్సి వస్తోంది. నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటైతే కోల్డ్ స్టోరేజ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. మిర్చియార్డు ఏర్పాటైతే నంద్యాల మిర్చి హబ్‌గా మారనుంది. జిల్లాలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూరు, శ్రీశైలం, ఆదోని, పత్తికొండ, కర్నూలు, ఆలూరు, పాణ్యం, డోన్, కోడుమూరు, నంద్యాల నియోజకవర్గాల్లోని రైతులు గుంటూరుకు వెళ్లకుండా నంద్యాల మిర్చి యార్డుకు పంటను అమ్ముకొనేందుకు వస్తారు. జిల్లా రైతులే కాకుండా అనంతపురం, వైఎస్సార్, ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాల రైతులు కూడా నంద్యాలలో పంటను అమ్ముకునేందుకు వస్తారు. దీంతో నంద్యాల పట్టణంలో కోల్డ్ స్టోరేజ్‌ల సంఖ్య పెరగడమే కాకుండా, హమాలీలకు, లారీ డ్రైవర్లకు పనులు దొరకడం, కమిషన్ వ్యాపారులు, రైతులతో నంద్యాల మార్కెట్‌యార్డు కిటకిటలాడే అవకాశం ఉంది. మిర్చి పంటను అమ్ముకోవడానికి గుంటూరుకు వెళ్లాల్సి ఉండటం. ?గుంటూరులో బ్రోకర్‌కు రూ.లక్షకు రూ.3వేలు చెల్లించాలి. ?ధర వచ్చేంత వరకు మూడు, నాలుగు రోజులు అక్కడే ఉండాలి. ?ధర రాకపోతే కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచడానికి బస్తాకు అదనంగా రూ.20 చెల్లించాలి. ?మిర్చిని తీసుకొని వెళ్లడానికి లారీకి రూ.20వేలు ఖర్చు. మూడు రోజులు ఆగితే రూ. 60వేలు బాడుగ చెల్లించాలి. ఈ ఏడాది నుంచే నంద్యాల మార్కెట్ యార్డులో మిర్చి యార్డును ప్రారంభించి, కొనుగోలు చేస్తాం. మిర్చి యార్డుకు సంబంధించి రాష్ట్ర మార్కెటింగ్ కార్యదర్శి ప్రద్యుమ్నతో మాట్లాడాం. ఆయన అనుమతి ఇచ్చారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు, వ్యాపారులు, రైతులతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించాం. మిర్చి వ్యాపారులకు లైసెన్స్‌లు మంజూరు చేస్తున్నాం. అన్నీ కుదిరితే డిసెంబర్ నెల నుంచే మిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తాం

# విజయనగరంలో 90 స్కూళ్లులో సీబీఎస్ఈ

విజయనగరం, డిసెంబర్ 18, (న్యూస్ పల్స్)సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం విద్యా సంస్కరణలు చేస్తోంది. ఇప్పటికే నాడు?నేడు పనులతో ఊరి బడికి ఆధునిక హంగులు అద్దింది. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. తాజాగా సీబీఎస్ఈ సిలబస్ అమలుకు సన్నాహాలు చేస్తోంది. రానున్న విద్యా సంవత్సరం నుంచి సిలబస్ బోధించేలా కార్యా చరణ ప్రణాళికను రూపొందిస్తోంది. సీబీఎస్ఈ సిలబస్ అమలుకు జిల్లాలో 90 పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో నిరు పేద విద్యార్థులకు ఖరీదైన విద్య అందుబాటులోకి రానుంది. సీబీఎస్ఈ సిలబస్‌తో పది, ఇంటర్ పూర్తి చేస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తాచాటే అవకాశం దక్కుతుంది. ఈ విధానం ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ, కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో అందుబాటులో ఉండగా... ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలుచేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సిలబస్ వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని విద్యావేత్తలు చెబుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రభుత్వ పాఠశాలల నుంచి దరఖాస్తులు వెళ్తున్నా యి. పాఠశాల విస్తీర్ణం రెండెకరాలకు పైబడి ఉన్నవాటికి తొలిప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో ఆంగ్ల మాధ్యమం ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ వసతి పాఠశాలలతో పాటు జిల్లాలోని తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలున్న మరో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయనున్నారు. వీటిలో వెయ్యి మంది పైబడి విద్యార్థులున్న రామభద్రపురం, మక్కువ, చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. నూతన విద్యావిధానం అమలులోభాగంగా 3, 4, 5వ తరగతులను విలీనం చేసిన జొన్నవలస, పాంచాలి, బుడతనాపల్లి, మెట్టపల్లి, గంట్యాడ, బలిజిపేట, కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సీబీఎస్ఈ సిలబస్ అమలులో ఉన్న పాఠశాలల్లో బోధన అత్యాధునికంగా ఉంటుంది. విద్యాలయాల పర్యవేక్షణ బోర్డు పరిధిలో ఉంటుంది. ఆరో తరగతి నుంచే జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో రాణించేలా ప్రోత్సహిస్తారు. విద్యార్థి అభ్యసనా సామ ర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. ప్రతి తరగతికి నిష్ణాతుడైన ఉపాధ్యాయుడు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, ఆటస్థలం ఉండటం వీటి ప్రత్యేకత. ప్రపంచ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా బోధన సిలబస్‌లో ఇమిడి ఉంటుంది. విద్యార్థికి స్నేహపూర్వకంగా ఉంటుంది. కోర్సు నిర్మాణం ఒత్తిడిని ఎదుర్కోకుండా చేస్తుంది. పుస్తకాలు ఆసక్తికరంగా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రూపొందిస్తారు. ఉల్లాసభరితమైన విద్యాబోధన ఉంటుంది. పోటీ పరీక్షల్లో విద్యార్థుల మేధస్సుకు పదును పట్టేలా ఉంటాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటాయి. వాస్తవాలకు దగ్గరగా విద్యను బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతానికి ప్రాధా న్యం కల్పించరు. ఎంత నేర్చుకున్నారో పరీక్షించే విధంగా ప్రశ్న పత్రాలు రూపొందిస్తారు. ఫలితాలు అనుకూలంగా వస్తాయి. తక్కువ మంది పరీక్షల్లో విఫలమవుతారు. ఐఐటీ, ఎయిమ్స్ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలను కొనసాగించాలను కుంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు చాలా సహాయ పడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు. వచ్చే సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య విద్యాలయాల్లో సీబీఎస్ఈ బోధన అమలుకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకంటరీ ఎడ్యుకేషన్ అనుమతులు ఇచ్చింది. 2024?25 విద్యా సంవత్సరానికి సీబీఎస్ఈ సిలబస్‌తో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్ని విద్యార్థులు రాసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# లోకేష్... ఏం చేస్తున్నాడో... అర్థమౌతోందా

గుంటూరు, డిసెంబర్ 18, (న్యూస్ పల్స్)జకీయం హుందాగా సాగాలి. నేరుగా పాలిటిక్స్ లోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా నేర్చుకోకపోతే ఎలా? ప్రత్యర్థులకు అస్త్రాలు దొరికే పనిచేస్తారా? ఇవీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై సొంత పార్టీ నుంచి విన్పిస్తున్న కామెంట్స్. అసలు రాష్ట్ర రాజకీయాలు లోకేష్ కు అర్థమవుతున్నాయా? అన్న ప్రశ్న కూడా విన్పిస్తుంది. పిల్ల చేష్టలు కాక మరేమిటని ప్రశ్నిస్తున్నారు. లోకేష్ జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తండ్రి కష్టపడుతుంటే? ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉంది. చంద్రబాబు పార్టీని పైకి లేపడానికి కిందా మీదా పడుతున్నారు. ఏ చిన్న అవకాశమొచ్చినా చంద్రబాబు తన రాజకీయ చతురతను ఉపయోగించి పార్టీకి ఒక్కొక్క ప్లస్ ను చేర్చుకుంటూ వెళుతున్నారు. చివరకు బోరు మని ఏడ్చి కొంత మార్కులు కొట్టేశారు కూడా. కానీ ఆయన తనయుడు నారా లోకేష్ కు మాత్రం ఇవేమీ పట్టడం లేదు. తన ధోరణి తనదేనన్న రీతిలో ఉన్నారు. ఎన్నిలకకు ఇంకా మూడేళ్లు సమయం ఉంది. ఏపీలో ఇంకా పొత్తులు కుదరలేదు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలసి పోటీ చేస్తుందన్న ప్రచారమయితే జోరుగా సాగుతుంది. కానీ పవన్ కల్యాణ్ ను నమ్మడానికి లేదు. చివరి నిమిషంలో హ్యాండ్ ఇచ్చినా ఇస్తారు. బీజేపీ గట్టిగా పట్టుబడితే పవన్ ఎటువైపు మొగ్గు చూపుతారన్నది చివరి వరకూ చెప్పడం కష్టమే. అయితే లోకేష్ అత్యుత్సాహం చూపిస్తున్నారని, జనసేన పార్టీ ఆఫీస్ కు వెళ్లడం క్యాడర్ ను అయోమయంలో పడేసినట్లేనని అంటున్నారు. ఇప్పటికే జనసేనతో పొత్తు ఉంటే తమకు సీటు దక్కదన్న ఆందోళన అనేక మంది నేతల్లో వ్యక్తమవుతుంది. వీరు పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ఖర్చు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు. ప్రధానంగా తూర్పు, పశ్చిమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలో ఈ పరిస్థితి ఉంది. లోకేష్ నిర్వాకంతో వీరిలో మరింత భయం మొదలవుతుంది. అయినా పొత్తుల విషయం చంద్రబాబు చివరలో తేలుస్తారు. ముందుగానే జనసేన పార్టీ కార్యాలయాలకు వెళ్లి లోకేష్ లేనిపోని తలనొప్పులు తెచ్చి పెట్టారంటున్నారు. ఇక మళ్లీ హామీలుతెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వచ్చే ఎన్నికలలో మంగళగిరిలోనే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ఈసారి తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. ఇటీవల మంగళగిరి నియోజకవర్గంలో పర్యటించిన లోకేష్ పార్టీ క్యాడర్ లో జోష్ నింపుతున్నారు. ఈరోజు కూడా మంగళగిరిలో ఆయన పర్యటించారు. అయితే అక్కడ టీడీపీకి ప్రధాన నేతగా ఉన్న గంజి చిరంజీవికి లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిసింది. మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ ఇంతవరకూ గెలుపు సాధించలేదు. 1985లో ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు మంగళగిరి నుంచి గెలిచారు. అదే టీడీపీ?కి మంగళగిరిలో చివరి గెలుపు. మూడున్నర దశాబ్దం నుంచి మంగళగిరిలో టీడీపీ జెండా ఎగురలేదు. ఇక్కడ పద్మశాలీలు ఎక్కువగా ఉంటారు. అదే సామాజికవర్గానికి చెందిన గంజి చిరంజీవికి 2014 ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చినా గెలవలేదు. 2019 ఎన్నికల్లో స్వయంగా లోకేష్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఈసారి గంజి చిరంజీవిని చీరాల నియోజకవర్గానికి పంపాలన్న నిర్ణయానికి లోకేష్ వచ్చినట్లు తెలిసింది. చీరాల అయితే.... ఈ మేరకు గంజి చిరంజీవికి లోకేష్ హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. గంజి చిరంజీవి పద్మశాలి సామాజికవర్గం నేత. ఆయన సతీమణిది కాపు సామాజికవర్గం. ఈ కాంబినేషన్ చీరాలలో వర్క్ అవుట్ అవుతుందని లోకేష్ భావిస్తున్నారు. గతంలోనూ పోతుల సునీతను చీరాలకు పంపినా ప్రయోజనం లేదు. అయితే ఈసారి గంజి చిరంజీవిని చీరాలకు పంపితే అక్కడ విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని పార్టీ అధినాయకత్వం భావిస్తుంది. ఇక్కడ లోకేష్ కు కూడా గంజి చిరంజీవి సామాజికవర్గం అండగా నిలుస్తుంది. చీరాలలో పద్మశాలిలు, కాపు సామాజికవర్గం ఓటు బ్యాంకు ఎక్కువ. అక్కడ గత ఎన్నికల్లో టీడీపీ నుంచి విజయం సాధించిన కరణం బలరాం వైసీపీ మద్దతుదారంగా మారిపోయారు. అక్కడ ఈసారి వైసీపీ నుంచి ఆమంచి కృష్ణమోహన్ పోటీ చేసే అవకాశాలు



ఎక్కువగా ఉన్నాయి. అందుకే గంజి చిరంజీవిని చీరాలకు పంపి తాను మంగళగిరిలో మరోసారి పోటీ చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని లోకేష్ డిసైడ్ అయ్యారు.

# మళ్లీ వైసీపీ ట్రాప్ లో టీడీపీ

విజయవాడ, డిసెంబర్18,(న్యూస్ పల్స్)చంద్రబాబు వైసీపీ ట్రాప్ లో పడుతున్నారా? ఆ అనుమానం ఎందుకు పడినట్లే కనపడుతుంది. నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తరచూ ఆవేశంతో చేసిన వ్యాఖ్యలు ఆయనకు కొన్ని సామాజికవర్గాలను మరింత దూరం చేస్తున్నాయి. ఒక్కొక్క అంశం వైసీపీ తెలివిగా చంద్రబాబును ట్రాప్ చేస్తుందనే అనుకోవాలి. మూడు రాజధానుల అంశం కావచ్చు. జస్టిస్ చంద్రుపై విమర్శలు కావచ్చు. చంద్రబాబు వైసీపీ ట్రాప్ లోపడినట్లే కనిపిస్తుంది. మూడు రాజధానుల అంశాన్ని తీసుకుంటే ఐదు కోట్ల మంది ఆంధ్రులు అమరావతిని రాజధానిగా ఉంచాలని భావిస్తున్నారని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. కానీ ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో తమకు న్యాయం జరగాలని, ఒక్క ప్రాంతానికే చంద్రబాబు మేలు చేస్తున్నారన్న వాదన బలంగా విన్పిస్తుంది. మూడు రాజధానుల అంశం జగన్ ప్రభుత్వం లేవనెత్తగానే దానికి అభ్యంతరం చెబుతూ చంద్రబాబు రెండు ప్రాంతాల్లో తన పార్టీని మరింత బలహీనం చేసుకున్నారు. టీడీపీ సెల్ఫ్ గోల్.... రాయలసీమ, ఉత్తరాంధ్ర టీడీపీ నేతలే లోలోపల మూడు రాజధానులను సమర్థిస్తున్నారు. కానీ పార్టీ లైన్ కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఉత్తరాంధ్రలో కొండ్రుమురళి వంటి వారే బాహాటంగా మూడు రాజధానులను సమర్థించారు. తిరుపతిలో సభ పెట్టినంత మాత్రాన సీమ మొత్తం ఒకే అన్నట్లు కాదు. రాజధానికి దగ్గరగా ఉండే నాలుగు జిల్లాలనే వారు అందుకే ఎంచుకున్నారని, దీని వెనక చంద్రబాబు ఉన్నారని వైసీపీ సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఇక జస్టిస్ చంద్రు విషయాన్ని చూసుకుంటే ఏపీలో ప్రధానమైన ఒక సామాజికవర్గాన్ని, మేధావులను చంద్రబాబు స్వయంగా దూరం చేసుకున్నట్లయింది. జస్టిస్ చంద్రు పదవుల కోసమే న్యాయవ్యవస్థపై వ్యాఖ్యలు చేశారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వైసీపీ చక్కగా ఉపయోగించుకుంటుంది. జస్టిస్ చంద్రుకు మంచి పేరుంది. సమర్థవంతమైన, నిజాయితీగల న్యాయమూర్తిగా ఆయన అందరికీ సుపరిచితులు. జై భీమ్ సినిమాతో ఆయన మరింత పాపులర్ అయ్యారు. అటువంటి చంద్రు పై చంద్రబాబు నెగిటివ్ కామెంట్స్ చేసి ప్రధానమైన వర్గాన్ని మరింత దూరం చేసుకున్నారంటున్నారు. జస్టిస్ చంద్రుపై చంద్రబాబు అలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందన్న అభిప్రాయం అనేక మంది వ్యక్తం చేస్తున్నారు.

# చెడ్డీ గ్యాంగ్ ఆట చెక్



విజయవాడ, డిసెంబర్ 18, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను భయబ్రాంతులకు గురి చేసిన చెడ్డీ గ్యాంగ్ ఆట కట్టించారు ఆంధ్రప్రదేశ్ పోలీసులు. చెడ్డీ గ్యాంగ్ సభ్యులలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు మడియా కాంజీ మేడా, సక్ర మండోద్, కమలేష్ బాబేరియాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మొదటి ఇద్దరు నిందితులు గుజరాత్ దాహూద్ జిల్లాలోని గార్బర్డ గ్రామానికి చెందినవారు కాగా, మరో వ్యక్తి మధ్యప్రదేశ్‌లోని ఝుబువా కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కాగా, అరెస్ట్ చేసిన నిందితులు ముగ్గురిని సీపీ క్రాంతి టాటా మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. నిందితులకు దోపిడీ, వారి వివరాలను మీడియాకు వెల్లడించారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. "గత నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోరీలు జరిగాయి. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశాం. మరో ఏడుగురు నిందితుల కోసం గాలిస్తున్నాం. మొత్తం పది గ్యాంగ్ సభ్యులు ఉన్నట్టుగా గుర్తించాం. మడియా కాంజీ మేదా, సక్ర మండోడ్, కమలేష్ బాబేరియా లుగా నిందితులను గుర్తించాం. ఈ చోరీలకు పాల్పడిన వారు గుజరాత్ గుల్బర్గ్‌కు చెందిన గ్యాంగ్‌లుగా గుర్తించాం. వీరంతా ప్రొఫెషనల్‌గా చోరీ చేసే వాళ్లు. ప్రస్తుతం అరెస్టైన నిందితులు మడియా కంజీ మేడా పై 18, సక్రా మండోడ్ మీద 5, కమలేష్ బబేరియా మీద 3 కేసులు ఉన్నాయి. 2015 నుంచి వీరిపై కేసులున్నాయి. ఏపీ, తమిళనాడులలో కేసులు నమోదయ్యాయి. గత నెల 26న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ లో విజయవాడకు ఈ గ్యాంగులు వచ్చాయి. ఈనెల 4, 8 తేదీలలో రెండు గ్యాంగులు వెళ్ళిపోయాయి. చడ్డీ గ్యాంగ్ ముఠాను అరెస్ట్ చేయడంలో ప్రజల నుంచి మంచి మద్ధతు లభించింది. రాత్రి గస్తీపెంచడం కూడా చాలా దోహదపడింది. మిగతా నిందితులు గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నట్లు సమాచారం అందింది. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పంపించాం. ఇంకా గాలింపులు కొనసాగుతున్నాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. దోపిడీ ముఠాలకు సంబంధించి సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. ప్రజలు సైతం తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి." అని సీపీ క్రాంతి సూచించారు

## భవానిపురం పోలీసు స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించిన సీపీ

విజయవాడ సెంబరు 18 పోలీసు కమిషనర్ గా బాధ్యతలను చేపట్టిన క్రాంతి రాణా టాటా శనివారం మధ్యాహ్నం భవానిపురం పోలీసు స్టేషన్ నూతన భవనం ని సందర్శించారు. సుమారు రెండు కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం గతనెల 30 న ప్రారంభించిన విషయం తెల్సిందే. ఐతే నగర సి పి గా బాధ్యతలు చేపట్టిన సీపీ తొలిసారిగా ఈ భవనాన్ని సందర్శించారు. భవనం లో అన్ని విభాగాల్లో ఆయన కలియతిరిగారు. స్టేషన్లో ఏ రూమ్ ఎవ్వరికీ కేటాయించారో సి పి కి స్థానిక సి ఐ జే మురలీకృష్ణ వివరించారు. విధినిర్వహణలో చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు,బాధితులకు పోలీసులు భరోసా ఇవ్వాలని,విధులు బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా ఈ నెల్లో జరగనున్న భవానీ దీక్షలు విరమణ ఏర్పాట్లు,రోడ్ల పరిస్థితి విషయంపై ఆయన ఆరా తీశారు. భావానిపురం వైపు రోడ్లు బాగానే ఉన్నాయని వెస్టజోన్ ఏ సి పి డాక్టరు కే హనుమంతరావు సమాధానం చెప్పారు కాకుంటే చిట్టినగర్ ప్రాంతంలో రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో సి పి కాంతి రాణా తాతా తో పాటుగా వెస్టజోన్ డి సి పి బాబూరావు,ఏ సి పి డాక్టర్ కే హనుమంతరావు లు వున్నారు.

# చెన్నై గోడవున్ లలో టాస్క్ ఫోర్స్ ఆకస్మిక దాడులు

## 170 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## ఒకరి అరెస్టు : పరారీలో గోడవున్ కీపర్లు

తిరుపతి డిసెంబర్ 18, (న్యూస్ పల్స్) చెన్నైలోని గోడవునుకు తరలించి, అక్కడ నుంచి పోర్ట్ ద్వారా విదేశాలకు రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న 170 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్ వస్తువుల గోడవున్ లో రహస్యంగా ఉంచిన దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా కనుగొన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ ఎస్పీ మేడా సుందరరావు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరించారు. శుక్రవారం ఉదయం కరకంబాడీ సమీపంలో అత్తిమాను చర్ల బేస్ క్యాంప్ వద్ద ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, కెవిబి పురంకు చెందిన సురేంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి అందిన సమాచారం తో శుక్రవారం సాయంత్రం సిఐ వెంకట రవి, ఆర్ ఐ (ఏ ఆర్) సురేష్ కుమార్ రెడ్డి టీమ్ చెన్నై సమీపంలోని పొన్నేరి తాలూకా విచూరు లో ఒక గోడవున్ పై దాడి చేసినట్లు తెలిపారు. అయితే గోడవునులో స్క్రాప్ తో నింపి ఉంచారని, టాస్క్ ఫోర్స్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి, దాచి ఉంచిన దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చెన్నై పోర్ట్ కు దగ్గరగా గోడవున్ ఉందని, మరో రెండు రోజుల్లో విదేశాలకు తరలించడానికి సిద్ధం గా ఉన్నట్లు తెలిపారు. ఇవి 2.086 టన్నుల బరువు ఉందని, దీని విలువ కోటిన్నర రూపాయల కు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. గోడవును కీపర్లు బీదా రఫీ, ఫరూక్ లు పరారీలో ఉన్నారని వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. వీరికి సహకరిస్తున్న తిరుపతి మంగళంకు చెందిన యశ్వంత్ కోసం టీమ్ లను పంపినట్లు తెలిపారు. ఈ కేసును సిఐ వెంకట రవి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆర్ ఎస్ ఐ సురేష్, ఆలీభాషా తదితరులు పాల్గొన్నారు.

# జగన్ జేబు సంస్థగా సీఐడీ

విశాఖపట్నం డిసెంబర్ 18, (న్యూస్ పల్స్) స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అనేక మందికి శిక్షణ ఇచ్చామని, దాదాపు 60 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు తెలిపారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే.. స్కిల్ డెవలప్మెంట్ మాజీ అధికారులను వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జగన్రెడ్డి జేబు సంస్థగా సీఐడీ మారిం దని విమర్శించారు. జగన్రెడ్డిని ప్రశ్నిం చే వారిపై కేసులు పెట్టేందుకే సీఐడీ పనిచేస్తోందన్నారు. సీఐడీ ఎజెండాను వైసీపీ పెద్దలు సెట్ చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. సీఐడీని దిగజా ర్చిన ఘనత జగన్రెడ్డికే దక్కుతుందని అయ్యన్నపాత్రుడు విమర్శలు గుప్పించారు.

# సీఎం కప్ బాక్సింగ్ పోటీలకు ఏర్పాట్లు

విశాఖపట్నం డిసెంబర్ 18, (న్యూస్ పల్స్) విశాఖలో సీఎం కప్ బాక్సింగ్ పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విశాఖ క్రీడాకారులు చక్కని గుర్తింపు పొందారని ఆయన కొనియాడారు. విశాఖ వేదికగా మూడు రోజుల పాటుగా జరిగే బాక్సింగ్ పోటీలకు సంబందించి ట్రోఫీని ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఏపీ సిఎం జగన్ జన్మదినం సందర్బంగా రాష్ట్రస్థాయిలో బాక్సింగ్ ఛాపియన్ షిప్ ను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి తెలిపారు. ఈ టెర్నమెంటు ప్రారంభోత్సవానికి వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి పాల్గొంటున్నారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశంలో విశాఖ నుంచి 70 శాతం మంది బాక్సర్లు ఉండేవారని అయితే గత పాలకుల నిర్లక్షం కారణంగా ప్రాధాన్యతను కోల్పోయిన బాక్సింగ్ క్రీడకు మళ్లీ పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బాక్సింగ్ క్రీడకు కేరాఫ్ అడ్రస్ విశాఖ నిలుస్తుందని అన్నారు. బాక్సింగ్ క్రీడా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.?

# చంద్రబాబు అనుచిత వ్యాఖ్యాలు బాధాకరం

శ్రీకాకుళం డిసెంబర్ 18, (న్యూస్ పల్స్) జస్టిస్ చంద్రుపై టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అనుచిత వాఖ్యలు చేయడం బాధాకరమని మంత్రి అప్పలరాజు అన్నారు. పేదల హక్కుల కోసం రిటైర్డ్ జడ్జ్ చంద్రు నిరంతరం పోరాడారని చెప్పారు. ప్రభుత్వం కోర్టులతో ఏవిధంగా పోరాడుతుందో ఆ వాస్తవాల గురించి రిటైర్డ్ జడ్జ్ చంద్రు మాట్లాడారని చెప్పారు. చంద్రబాబు ఫ్రస్టేషన్లో మాట్లాడుతున్నారన్నారు. ఎవరైనా ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడితే పేటిఎం బ్యాచ్తో తిట్టిస్తున్నారని మండిపడ్డారు..త్రీ క్యాపిటల్ అంశంపై ఉత్తరాంధ్రలో ఉద్యమం జరగాల్సి ఉందన్నారు. జేఏసీ ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు. విశాఖ రాజధాని అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి అప్పలరాజు తెలిపారు.

# నవవధువును హతమార్చిన భర్త

విశాఖపట్నం డిసెంబర్ 18, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా భీమిలి పరిధిలోని గోవుపేటలో దారుణం జరిగింది. ఓ నవ వధువును ఆమె భర్తే అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మృతురాలి మెడ, కాళ్లకు తాడు కట్టి ఉండటం... ఛాతిపై వాతలు పెట్టి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆమె భర్తకు మూఢనమ్మకాలు, మంత్ర, తంత్రాలపై ఆసక్తి ఎక్కువని... ఆ పిచ్చిలో పడే ఆమెను హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తగరపువలస వలందపేటకు చెందిన నరసాయమ్మ కు పుక్కళ్లపాలేనికి చెందిన హరితో నెల రోజుల క్రితమే వివాహం జరిగింది. వివాహం తర్వాత ఇద్దరు గోవుపేటలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. హరి స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ ఉదయం నరసాయమ్మ ఇంట్లోనే శవమై కనిపించింది. నరసాయమ్మ ప్రతీరోజూ తన అన్న అప్పారావుతో ఫోన్లో మాట్లాడేది. శుక్రవారం ఉదయం నుంచి అతను ఫోన్ చేస్తున్నా ఆమె స్పందించట్లేదు. దీంతో అనుమానం వచ్చిన అప్పారావు... ఇంటికెళ్లి చూడగా... ఇంట్లో విగతజీవిగా కనిపించింది. నరసాయమ్మ భర్త హరిని అప్పారావు నిలదీయగా అతని నుంచి ఉలుకు పలుకు లేదు. దీంతో అప్పారావు భీమిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

# అమరావతి ఉద్యమకారులంతా రియల్ ఎస్టేట్ వ్యాపారులే

## వైకాపా ఎమ్మెల్యేలు

విశాఖపట్నం డిసెంబర్ 18 అమరావతి కూడా ఆంధ్రప్రదేశ్కు ఒక రాజధాని అన్నారు వైసీపీ ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్. విశాఖలో మీడి యాతో మాట్లాడిన ఆయన.. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే జగ న్ మూడు రాజధానులు తీసుకు వ చ్చారని తెలిపారు. చంద్రబాబు అమ రావతిలోనే రాజధాని ఎందుకు ఉంచా లి అంటున్నారో చెప్పాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు. అది రాష్ట్ర రాజధాని కోసం చేసిన పాదయాత్ర కాదని రియ ల్ ఎస్టేట్ కోసం చేసిన పాదయాత్ర అని వ్యాఖ్యానించారు. భూములకు రేట్లు కోసం పాదయాత్ర చేస్తున్నారని అమ ర్నాథ్ వ్యాఖ్యానించారు. ఉద్యమం చేస్తున్నవారు, ఉద్యమాన్ని నడిపిస్తు న్నవారందరు రియల్ ఎస్టేట్ వ్యాపారు లేనని...చంద్రబాబు ఆలోచనలను రాష్ట్ర ప్రజలపై రుద్దుతున్నారని ఆయ న మండిపడ్డారు. చంద్రబాబు దత్తపు త్రుడు పవన్కుఒక స్టాండ్ లేదని .. ఆయన ఎక్కడికి వెళ్తే అదే రాజధాని అంటారంటూ దుయ్యబట్టారు. గతం లో అమరావతి ఒక స్కామ్ అన్న బీజేపీ నాయకులు ఇప్పుడు మద్దతు తెలుపుతున్నారని అమర్నాథ్ మండి పడ్డారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు కలిగిన వామపక్ష పార్టీలు క్యాపిటలి స్టులకు మద్దతు తెలపడం దారుణమ న్నారు. రానున్న రోజులలో మూడు రాజధానుల బిల్లును అసెంబ్లీలో జగన్ ప్రవేశపెడతారని అమర్నాథ్ స్పష్టం చేశారు. ఈ బిల్లుకు రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తు న్నార ని..భూములు కాపాడటం కోసం, భూముల రేట్లు పెంచడం కోసం పాద యాత్ర చేశారని ఆయన ఆరోపించారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లా డుతూ..చంద్రబాబు రాజధాని విష యంలో ఎన్ని డ్రామాలు వేస్తున్నారో రా ష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నా రు. ఉత్తరాంధ్రకు మోసం జరుగుతుంటే టీడీపీ నాయకులు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. స్థానిక సంస్థలు ఎన్ని కల ఫలితాల ద్వారా మూడు రాజధా నులకు ప్రజలు మద్దతు తెలియజేశా రని అదీప్ రాజు గుర్తుచేశారు. చంద్ర బాబు ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జగన్తోనే సాధ్య మన్న ఆయన త్వరలోనే అసెంబ్లీలో మూడు రాజధానులు బిల్లు ప్రవేశపెడ తారని స్పష్టం చేశారు.

# స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

## జిల్లా యస్.పి. సీహెచ్ విజయరావు


నెల్లూరు డిసెంబర్ 18 స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో ఏ విధంగానైనా అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ సిహెచ్ రాజారావు అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానికంగా ఆయన స్పందన ఫిర్యాదులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పందన ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులకు గల కారణాలు తెలుసుకొని, తగు సూచనలు చేసి పరిష్కార మార్గాలకు పలు సూచనలు ఇవ్వాలని సూచించారు. సమస్యలను పరిష్కరించిన వెంటనే పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. స్పందన ఫిర్యాదులపై ప్రతి శనివారం సమీక్ష ఉంటుందన్నారు. నూతన సంవత్సర వేడుకలపై గట్టి పోలీసు నిఘా, విరివిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. 2022 నూతన సంవత్సరం సందర్భంగా, డిసెంబర్ 31 వ తేది రాత్రి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వివరించాలని పోలీసులను ఆదేశించారు. కొత్త సంవత్సరంలో నూతన స్టేషన్ రికార్డులు అప్డేట్ చేసి, స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో త్వరలో నిర్వహించబోయే పోలీస్ స్పోర్ట్స్ మీట్ కు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సబ్ డివిజన్ ప్రకారం హెచ్ జి నుండి డి ఎస్ పి వరకు టీములు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్ బాటలో బీజేపీ : అఖిలేశ్ యాదవ్



లక్నో : బెదిరింపు రాజకీయాల్లో కాంగ్రెస్ను బీజేపీ అనుసరిస్తోందని సమాజ్వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. సమాజ్వాదీ పార్టీ నేతలు, మద్దతుదారుల ఇళ్లు, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ దాడుల నేపథ్యంలో అఖిలేశ్ స్పందిస్తూ బీజేపీ ప్రతిపక్షాలను బెదిరించేందుకు కేంద్ర సంస్థలను ఉపయోగించుకుంటోందన్నారు. అఖిలేశ్ శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, "కాంగ్రెస్ మాదిరిగా బీజేపీ కూడా అదే దారిలో వెళ్తోంది. కాంగ్రెస్ గత చరిత్రను చూడండి, ఎవరినైనా బెదిరించాలనుకుంటే, కేంద్ర సంస్థలను ఉపయోగించుకుంటూ ఉండేది. నేడు బీజేపీ కూడా అదే చేస్తోంది" అని అన్నారు. రాష్ట్రంలో రామ రాజ్యాన్ని తెస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో బీజేపీ విఫలమైందని చెప్పారు. రామరాజ్యాన్ని తీసుకొస్తామని బీజేపీ చెప్పేదని, అయితే సామ్యవాద మార్గమే రామరాజ్యాన్ని తీసుకొస్తుందని తెలిపారు. సామ్యవాదం వస్తే రామ రాజ్యం వస్తుందని తెలిపారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు శనివారం ఉదయం వారణాసి నుంచి మావు చేరుకుని, సహదత్ పురలోని సమాజ్వాదీ పార్టీ జాతీయ కార్యదర్శి రాజీవ్ రాయ్ నివాసంలో సోదాలు చేశారు. ఆయన పన్ను ఎగవేసినట్లు అనుమానంతో ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని నినాదాలు చేశారు. పోలీసులు స్పందిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దని ప్రజలను కోరారు. మయిన్పురిలోని ఆర్సీఎల్ గ్రూప్ యజమాని మనోజ్ యాదవ్ నివాసంలో కూడా అధికారులు సోదాలు చేశారు. అదేవిధంగా లక్నోలోని జైనేంద్ర యాదవ్ నివాసంలో కూడా ఆదాయపు పన్ను శాఖ దాడులు జరిగాయి. వీరిద్దరూ అఖిలేశ్ యాదవ్కు సన్నిహితులేనని తెలుస్తోంది.

# పాక్ సరిహద్దుల్లో డ్రోన్ను కూల్చేసిన బీఎస్ఎఫ్



న్యూఢిల్లీ : భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఓ డ్రోన్ను కూల్చేసినట్లు సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) శనివారం ప్రకటించింది. పంజాబ్లోని ఫిరోజ్పూర్ సెక్టర్, వాన్ సరిహద్దుల వద్ద శుక్రవారం రాత్రి 11.10 గంటలకు దీనిని కూల్చేసినట్లు తెలిపింది. ఇది చైనాలో తయారైనట్లు పేర్కొంది. అంతర్జాతీయ సరిహద్దుల నుంచి సుమారు 300 మీటర్లు, సరిహద్దు కంచె నుంచి 150 మీటర్ల దూరంలో దీనిని కూల్చినట్లు వివరించింది. 23 కేజీల బరువుగల ఈ డ్రోన్కు నాలుగు పవర్ బ్యాటరీలు ఉన్నాయని, 10 కేజీల బరువును మోయగలదని తెలిపింది. అయితే దీనిలో ఆయుధాలు, మందుగుండు లేదా మాదక ద్రవ్యాలు వంటివేవీ లేవని పేర్కొంది. ఈ ప్రదేశంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. గతంలో పాకిస్థాన్ నుంచి ఆయుధాలు, మందుగుండు తీసుకొస్తున్న రెండు డ్రోన్లను కూల్చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు సంఘటనలు కూడా పంజాబ్ సరిహద్దుల్లోనే జరిగాయి.

# ట్రాక్టర్ ను ఢీ కొన్న లారీ...ఇద్దరు మృతి?ముగ్గురికి గాయాలు

త్రిపురాంతకం ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లాపల్లి వద్ద కర్నూలు గుంటూరు రహదారిపై ఆగిఉన్న ట్రాక్టర్ ను ఢీ కొన్న లారీ ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బాలకృష్ణ తోపాటు ట్రాక్టర్ లో ఉన్న వీరమ్మ అనే మహిళ స్పాట్ లోనే మృతి చెందారు..మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి

వీరిలో రమణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండగా,అంజమ్మ అనే మహిళకు నడుము భాగం పూర్తిగా దెబ్బతిన్నది. వీరిని మెరుగైన వైద్యంకోసం నరసరావుపేట తరలించారు..కడప జిల్లా పొద్దుటూరు నుండి త్రిపురాంతకం వైపు పాలలోడుతో వస్తున్న లారీ,ఆగిఉన్న ట్రాక్టర్ ను అతివేగంగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినది..కేసునమోదు చేసుకొన్న పోలీస్ లు దర్యాప్తు చేపట్టారు..మృతదేహాలను పోస్ట్ మార్టం కొరకు యర్రగొండపాలెం ప్రభుత్వవైద్యశాలకు తరలించారు..

# రిస్క్ లోకి ఒమిక్రాన్



హైదరాబాద్, డిసెంబర్ 18, (న్యూస్ పల్స్)ప్రపంచ వ్యాప్తంగా ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వ్యూహంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విమానాశ్రయాల్లో కేవలం రిస్క్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ఎక్కువగా దృష్టి పెట్టి పరీక్షలు చేస్తున్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో నమోదైన మూడు ఒమిక్రాన్ కేసులూ నాన్ రిస్క్ దేశాల నుంచి వచ్చినవే కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం విదేశీ ప్రయాణికుల విషయంలో తీసుకోవల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేసింది. రిస్క్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులందరికీ కోవిడ్?19 నిర్ధారణ పరీక్షలు చేయాలని, నాన్ రిస్క్ దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల్లో 2 శాతం మందికి ర్యాండమ్గా పరీక్షలు చేయాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల ఒకటో తేదీ నుంచి ఆ మార్గదర్శకాలను అనుసరిస్తున్నాయి. 11 దేశాలను రిస్క్ కేటగిరీ కింద గుర్తించారు. ఇందులో జర్మనీ, ఫ్రాన్స్, కెనడాతో పాటు యూఎస్, యూకే తదితర దేశాలున్నాయి. ఆయా దేశాల నుంచి వచ్చిన అందరు ప్రయాణికులకు, అలాగే ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి ర్యాండమ్గా శంషాబాద్ విమానాశ్రయంలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రిస్క్ దేశాల నుంచి వచ్చి పాజిటివ్గా తేలిన వారి నమూనాల్లో ఒమిక్రాన్ను గుర్తించేందుకు జీనోమ్ సీక్వెన్సింగ్కు పంపిస్తున్నారు. వారిని విమానాశ్రయం నుంచి నేరుగా టిమ్స్కు తరలిస్తున్నారు. నాన్ రిస్క్ దేశాల నుంచి వచ్చిన వారి నుంచి (2 శాతం) కేవలం నమూనాలు సేకరించి ఆర్టీపీసీఆర్ ఫలితం రాకముందే పంపేస్తున్నారు.

# రిమ్స్ లో ఆక్సిజన్ సిలిండర్ లీకేజీ

## జిజిహెచ్ పరిపాలనాధికారి, జేసీ (హౌసింగ్) ధ్యానచంద్ర

కడప, డిసెంబర్ 18 కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్) లేబర్ వార్డులో పేషంటుకు వినియోగిస్తున్న ఆక్సిజన్ సిలిండర్ స్వల్ప లీకేజీ వల్ల ఎలాంటి అపాయం జరగలేదని.. జిజిహెచ్ పరిపాలనధికారి, జేసీ (హౌసింగ్) ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం రిమ్స్ ఆవరణలోని జిజిహెచ్ లేబర్ వార్డులో ఆక్సిజన్ గ్యాస్ లీకేజీ అవుతోందన్న వదంతులు రావడంతో.. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు... జిజిహెచ్ పరిపాలనాధికారి, జేసీ (హౌసింగ్) ధ్యానచంద్ర రిమ్స్ కు తక్షణమే వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ వార్డులో సెంట్రల్ ఆక్సిజన్ సపోర్టు తో ఉన్న పేషెంట్ ను .. చిన్న ఆక్సిజన్ సిలిండర్ (1.5 లీటర్స్) సపోర్టుతో.. ఆ పేషంట్ ను సిటీ స్కానింగ్ నిమిత్తం సిటీ స్కాన్ రూముకు తరలిస్తున్న సమయంలో.. సిలిండర్ పై భాగంలో ఉన్న ఫ్లో మీటర్ వాల్వ్ కొంత లూజ్ కావడంతో, ప్రెజర్ కారణంగా స్వల్పంగా గ్యాస్ లీకేజీతో పాటు శబ్దం రావడంతో.. స్థానిక పేషంట్లు కొంత భయాందోళనకు గురయ్యారన్నారు. వెంటనే ఆసుపత్రి పరిపాలనా సిబ్బంది అప్రమత్తం కావడం, పరిస్థితిని పరిశీలించడం జరిగింది. అయితే అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదని ఫ్లో మీటర్ వాల్వ్ కొంత లూజ్ కావడంతో, ప్రెజర్ కారణంగా స్వల్పంగా గ్యాస్ లీకేజీతో పాటు శబ్దం రావడంతో పేషంట్లు, సిబ్బంది ఒకింత కంగారుకు గురయ్యారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి చిన్న పొరపాట్లు కూడా జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన పడవలసి అవసరం లేదని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ (హౌసింగ్) వెంట ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డా. సురేశ్వర్ రెడ్డి, ఆర్.ఎం.ఓ. డా.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

## టిడిపి మహిళా నేత మల్లి నిర్మల

నెల్లూరు డిసెంబర్ 18 తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర ఆర్థిక సహకార మాజీ డైరెక్టర్ మల్లి.నిర్మలను పార్టీ అధిష్టానం పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేసి సస్పెండ్ చేసింది . ఈ మేరకు ఆమె స్థానిక ప్రెస్క్లబ్లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుగు దేశం పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రధానంగా పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మాజీ డైరెక్టర్ ఖాజవలి మరియు మల్లి.నిర్మలను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ను వివరణ కోరగా, ఖాజావలి జిల్లా పార్టీ పెద్దలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టడం జరిగిందని అబ్దుల్ అజీజ్ చెప్పారని తెలిపారు. ఆయనను సస్పెండ్ విషయమై అడగగా నీవు పార్టీలో ఎవరి మీద ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, అటువంటి విషయాలు నా దృష్టికి రాలేదని ,నిన్ను సస్పెండ్ చేసే విషయం కూడా నాకు తెలియదని పార్టీ అధిష్టానం తో మాట్లాడి తనకు తప్పక న్యాయం చేస్తానని నాకు అబ్దుల్ అజీజ్ హామీ ఇచ్చారని మీడియాకు తెలియజేశారు . నాపై ఉన్న సస్పెండ్ ను ఎత్తివేసేందుకు అధిష్టానంతో మాట్లాడుతానని అబ్దుల్ అజీజ్ చెప్పడంతోనే విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పార్టీ లో లో నియమ నిబంధనలు కలిగినా నాయకురాలిగా, నిజాయితీగా పార్టీ కోసం పని చేశానని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి తనపై ఉన్న సస్పెండ్ ను ఎత్తివేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులకు తన ఆవేదన వ్యక్తపరిచారు.

# అనంత రూరల్ లో వ్యక్తి దారుణ హత్య

అనంతపురం డిసెంబర్ 18అనంతపురం రూరల్ కామరపల్లి సమీపంలో రాజేష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కొడవలితో గొంతుకోసి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. అక్రమ సంబందం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనంతపురం శివారు నందమూరి నగర్ కు చెందిన మృతుడు రాజేష్ తాపీ మేస్త్రి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేరే మహిళతో కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగుతోందని గొడవలు జరిగినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. శుక్రవారం రాత్రి స్నేహితులతో కలిసి రాత్రి 8 గంటల సమయంలో మద్యం సేవించడానికి కామర్ పల్లి సమీపంలో వెళ్లి అక్కడ కొత్తగా వెంచర్ వేసిన గ్రౌండ్ లో స్నేహితులు గురుమూర్తి బాలరాజు కలసి మద్యం సేవించారు. మద్యం మత్తులో కొడవలితో దాడి చేసి ఉంటారని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని రూరల్ ఇంచార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ గౌడ్ తెలిపారు.

# వివాహిత ఆత్మహత్య

ఏలూరు డిసెంబర్ 18పశ్చిమ గోదావరి జిల్లాలో శుక్రవారం విషాద ఘటన చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం మండలం గొల్లగూడెంకు చెందిన సబ్బన సాయి బాలచంద్తో ఆదిలాబాద్ జిల్లా జయనాథ్ గ్రామానికి చెందిన పుష్పలత ఒక యాప్ ద్వారా ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి వీరిద్దరూ తణుకులో ఉంటు న్నారు. బాలచంద్ అమెజాన్లో డెలివరీ బాయ్గా పనిచేస్తున్నా డు. తరచూ ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో పుష్పలత శుక్రవారం ఇంట్లో ఫ్యాన్కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

# అమరావతిలో గ్రాఫిక్స్ తప్ప ఏంలేదు

## మంత్రి బాలినేని

ఒంగోలు డిసెంబర్ 18 టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో రఘురామరాజు జతకలిసి దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంత్రి బాలినేని మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు మీద అంత అభిమానం ఉంటే జగన్ బొమ్మ మీద గెలిచిన ఆయన రాజీనామా చేసి టీడీపీ నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీని పొగడడం వంటి డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు. దమ్ము, ధైర్యం ఉంటే సొంత నియోజకవర్గంలో పర్యటించాలన్నారు. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిస్తే ఎవరు విజన్ ఉన్న నాయకుడో తెలుస్తుందని చెప్పారు. అమరావతిని రాజధానిగా పెట్టిన చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం సరైన రోడ్లు కూడా వేయలేకపోయిన చంద్రబాబు ఎలా రాజధాని అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు.

# రాజకీయ నాయకులు, అధికారుల చేతుల్లో కరిగి పోతున్న వక్ఫ్ బోర్డు ఆస్తులు

నంద్యాల డిసెంబర్18,(( విభారె) ) సీపీఐ జిల్లా కార్యదర్శి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ నంద్యాల యందు వందల ఎకరాలు వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉన్నాయని మా పెద్దలు చెప్పేవారని ఇప్పుడు ఆ ఆస్తులు ఐస్ గడ్డలా కరిగి పోయాయని విమర్శించారు . రాజకీయ నాయకులకు వక్ఫ్ బోర్డు ఆస్తులు కల్పవృక్షంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం లోకి ఏ ప్రభుత్వం వచ్చిన వారు తమ అనుచరులకు ఆదాయం కోసం వక్ఫ్ బోర్డు ఆస్తులను ధారాదత్తం చేయడం పరి పాటిగా మారిందని విమర్శించారు. పైకి మాత్రం ఒకరిపై ఒకరి విమర్శలు చేసుకుంటూ వక్ఫ్ బోర్డు ఆస్తులను ఐచ్ గడ్డలా కరిగింప జేస్తున్నారని విమర్శించారు. ఇదే అదునుగా వక్ఫ్ బోర్డు అధికారులు మరియు రెవెన్యూ అధికారులు సెంటు ప్రకారం అమ్మకాలు చేస్తున్నారని వామపక్ష పార్టీలైన మేము తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు .కొందరు ముస్లిం సోదరులు డబ్బులకు ఆశ పడి రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవరించడము వల్లే వక్ఫ్ బోర్డు ఆస్తుల యందు బహుల అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు . కనీసం మిగిలిన దానిలో నైనా పేద ముస్లింలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని పలువురు ముస్లిం నాయకులు కోరుతున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# కండలేరు జలాశయం మట్టికట్ట శాశ్వత మరమ్మతులు త్వరలో పూర్తి చేస్తాం

## జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు

నెల్లూరు డిసెంబర్ 18 కండలేరు జలాశయ మట్టికట్ట శాశ్వత మరమ్మతు పనులను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. శనివారం రాపూరు మండలం కుమ్మరగుంట వద్ద కండలేరు మట్టికట్ట 6వ కిలోమీటర్ వద్ద ఇటీవల సంభవించిన వర్షాలకు మట్టి కొంత దిగువకు జారిన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ చేపడుతున్న మరమ్మతు పనులను తెలుగు గంగ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీ హరి నారాయణ రెడ్డి కలెక్టర్ కు వివరించారు. మట్టి జారిన వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని మరో 10 రోజుల్లో పూర్తిస్థాయి మరమ్మతు పనులను పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కండలేరు వద్ద మట్టికట్ట నుంచి మట్టి కిందకు జారడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తాను వచ్చినట్లు పేర్కొన్నారు. ఇక్కడ మట్టి జారిన వెంటనే ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టినందుకు కలెక్టర్ కండలేరు జలాశయ అధికారులను అభినందించారు. అలాగే ఇటీవల జిల్లాలో సంభవించిన వరదలకు దెబ్బతిన్న గ్రామాల్లో మంచినీరు, రహదారి, విద్యుత్ ఇతర సౌకర్యాల పునరుద్ధరణకు చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. జిల్లాలో 37 చోట్ల పంచాయతీ రాజ్ రహదారులు దెబ్బతినగా 30 చోట్ల మరమ్మతు పనులు పూర్తి చేశామని, ఆర్ అండ్ బి కి సంబంధించి 30 మేజర్, 30 మైనర్ మొత్తం 60 రహదారుల మరమ్మతు పనులకు అనుమతులు మంజూరు చేశామని, కొన్నిచోట్ల శాశ్వత మరమ్మతు పనులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కలెక్టర్ వివరించారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపు లు, పారిశుద్ధ్య నివారణా చర్యలను చేపట్టినట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు రెండు వేల మెట్రిక్ టన్నుల దాణాను ఉచితంగా అందించామని, నష్టపరిహారం కూడా చెల్లించామన్నారు. పునరావాస కేంద్రాల్లో గడిపిన కుటుంబాలకు అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించామన్నారు. జిల్లాలో 251 పక్కా గృహాలు దెబ్బతిన్నాయని వీరికి కొత్త గృహాలు మంజూరు చేసినట్లు చెప్పారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళకు 95 వేల రూపాయలు, పూరి గుడిసెలకు 5200 రూపాయలు బాధితుల ఖాతాల్లోకి జమ చేసినట్లు చెప్పారు. జిల్లాలో వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు చాలామంది ముందుకు వచ్చారని, వీరి సాయంతో అవసరమైన చోట బాధితులకు ఇంటి సామాగ్రి, ఎస్టిలకు ఇంటి నిర్మాణానికి 15 వేల రూపాయల అదనపు సహాయాన్ని అందజేస్తామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరద నష్టం నివారణ చర్యలను ముమ్మరంగా చేపడుతున్నట్లు వివరించారు.

# తలలో వచ్చే దురదను తగ్గించడంలో సహాయపడే చిట్కాలు ఇక్కడ ఉన్నాయి

చలికాలం వచ్చే సరికి జుట్టుకు సంబంధించిన అనేక సమస్యలు వస్తాయి, వాటిలో ఒకటి తల దురద. ఇది చుండ్రు మరియు తామర వంటి కారణాలతో పాటు అత్యంత చికాకు కలిగించే సంచలనాలలో ఒకటి. ఇది పొడి మరియు దురదకు కారణమవుతుంది.దీన్ని వదిలించుకోవడం సాహసం కాదు, కానీ మీరు కొన్ని చిట్కాలను అనుసరించాలి. దీని కోసం మేము మీకు స్కాల్ప్ దురదను తగ్గించుకోవడానికి నిపుణులు సిఫార్సు చేసే సూచనలను అందించబోతున్నాము. వీటిని పాటించడం వల్ల తల దురద నుంచి బయటపడవచ్చు.1. క్లెన్సింగ్ షాంపూతో మీ జుట్టును కడగండి:స్కాల్ప్ దురదను నివారించడానికి షాంపూతో శుభ్రపరచడం నిజంగా ఉపయోగకరంగా ఉంటుంది. క్లెన్సింగ్ షాంపూతో మీ జుట్టును సున్నితంగా కడుక్కోవడం వల్ల తల చర్మం దురదకు ఒక కారణం అయినందున, జిడ్డుగల స్కాల్ప్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, పొడి స్కాల్ప్‌కు మరొక కారణం కఠినమైన షాంపూలను ఉపయోగించడం. కాబట్టి మీరు అలాంటి షాంపూని ఉపయోగిస్తుంటే, వెంటనే ఆపండి.2. మీ జుట్టు మరియు నెత్తిమీద తేమగా ఉంచుకోండి:తలపై దురదలు రాకుండా ఉండాలంటే జుట్టు మరియు స్కాల్ప్ మాయిశ్చరైజింగ్ అవసరం. దీని కోసం జుట్టు మరియు స్కాల్ప్ మాయిశ్చరైజింగ్ ఉత్పత్తులను ఉపయోగించండి. ఇది మీ జుట్టుకు ఆరోగ్యకరమైన రూపాన్ని ఇస్తుంది. మీరు సరైన నూనె, మంచి షాంపూ మరియు కండీషనర్‌తో మీ జుట్టును హైడ్రేట్ చేయవచ్చు.వింటర్లో ఈ హీరోల ఫ్యాషన్ డ్రస్సులను ట్రై చేయండి.. కూల్ గా కనిపించండి...! వింటర్లో ఈ హీరోల ఫ్యాషన్ డ్రస్సులను ట్రై చేయండి.. కూల్ గా కనిపించండి...!3. సహజ హెయిర్ మాస్క్:న్యాచురల్ హెయిర్ మాస్క్ ఉపయోగించడం వల్ల తల దురదను తగ్గించుకోవచ్చు. నిమ్మకాయ, తేనె, మొజారెల్లా వంటి సహజ పదార్థాలను ఉపయోగించే హెయిర్ మాస్క్‌లు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ కలిగి ఉండవు, కానీ ఆరోగ్యకరమైనవి కూడా. ఇవి బాగా పని చేస్తాయి మరి యు మీ జుట్టుకు అవస ̃రమైన పోషకాలను అందిస్తాయి. కాబట్టి వీలైనంత వరకు నేచురల్ హెయిర్ మాస్క్‌ని ఉప మ్మల గురించి చిం తిస్తున్నారా? సులభంగా ఇంట్లోనే కనుబొమ్మలు మం దంగా మార్చుకోవచ్చు!సన్నని కనుబొమ్మల గురించి చింతిస్తున్నారా? సులభంగా ఇంట్లోనే కనుబొమ్మలు మందంగా మార్చుకోవచ్చు!4. తల చర్మం కోసం ఆల్కహాల్ ఆధారిత ఉత్పత్తులను నివారించండి:ఆల్కహాల్ ఆధారిత ఉత్పత్తులను తలపై ఉపయోగించకూడదు ఎందుకంటే అవి దురద, పొడి చర్మం కలిగిస్తాయి. ఆల్కహాల్ కలిగిన జెల్లు, మూసీ, హెయిర్ స్ప్రేలు వంటి మీ స్కాల్ప్ మరియు హెయిర్ డ్రై చేసే ఇతర ఉత్పత్తులను ఉపయోగించకుండా ఉండండి. అవి మీ చర్మానికి ఎటువంటి హాని చేయనట్లు అనిపించవచ్చు, కానీ, వాస్తవానికి, అవి మంచి కంటే ఎక్కువ హాని చేస్తాయి. కాబట్టి మీరు తల దురదను తగ్గించుకోవాలనుకుంటే, వెంటనే అటువంటి ఉత్పత్తులను ఉపయోగించడం మానేయండి.జాగ్రత్త అవసరం:పొడి మరియు దురదతో కూడిన జుట్టు చికాకును తగ్గించడానికి పై చిట్కాలను ప్రయత్నించండి. కానీ, దానిని గుర్తించడం ముఖ్యం. స్కాల్ప్ దురద ఎక్కడైనా, అంటే ఒక వైపు లేదా మొత్తం తలపై రావచ్చు. కానీ, ఇది సాధారణంగా గట్టి పోనీటైల్‌ను అన్‌ప్యాక్ చేసిన తర్వాత జరుగుతుంది. కాబట్టి ఏ చిన్న సమస్యనైనా నిర్లక్ష్యం చేయకండి. ఇది అనేక సమస్యలకు దారి తీస్తుంది. సమస్య తీవ్రతరం కాకముందే వాటిని పరిష్కరించడం చాలా అవసరం.పొడి దురద స్కాల్ప్ అంటే ఏమిటి?మీ తలపై చర్మం తేమ లేనప్పుడు పొరలుగా మారుతుంది, ఇది చివరికి మీ నెత్తిమీద పొడిగా మరియు దురదగా మారుతుంది. మీరు చల్లని లేదా పొడి గాలికి గురైనప్పుడు కూడా ఇది సంభవించవచ్చు.కొన్నిసార్లు, దురద స్కాల్ప్ మన కంటితో కనిపించే సంకేతాలతో వస్తుంది. ఉదాహరణకు, మీ చర్మం పొలుసులుగా లేదా పొరలుగా మారుతుంది. అయితే, ఇతర సమయాల్లో, కనిపించని సంకేతాలు లేనప్పుడు కూడా మీ చర్మం దురదగా ఉంటుంది.శీతాకాలంలో తల దురదకు కారణాలు ఉ లక్షణాలుచలికాలంలో మీ తల దురదలు రావడానికి ప్రధాన కారణాలలో ఒకటి చుండ్రు. కానీ అలా కాకుండా, సెబోరోహెయిక్ డెర్మటైటిస్ - ఇన్ఫ్లమేటరీ స్కిన్ కండిషన్, శీతాకాలంలో మీ తల దురదగా మార్చడంలో కూడా తీవ్రమైన పాత్ర పోషిస్తుంది. ఈ పరిస్థితి ఒత్తిడి, చర్మంపై ఈస్ట్ అధికంగా పెరగడం, రుతువుల మార్పు లేదా హార్మోన్లలో మార్పు వంటి కారణాల వల్ల కావచ్చు.



# ఆహా అనిపించుకుంటున్న 'అనుభవించు రాజా'..!




తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పరిచయం చేస్తూ డిజిటల్ వరల్డ్ లో అడుగుపెట్టిన ప్రాంతీయ ఓటీటీ 'ఆహా'. ఎప్పటికప్పుడు ప్రేక్షకుడి అభిరుచికి అనుగుణంగా ఫ్రెష్ కంటెంట్ ను అప్లోడ్ చేస్తూ.. అనతి కాలంలోనే విశేష ఆదరణ దక్కించుకుంది. ఈ క్రమంలో దిగ్గజ ఓటీటీలకు ధీటుగా నిలుస్తోంది. కొత్త సినిమాలు - ఒరిజినల్ వెబ్ సిరీస్ లతో పాటుగా స్పెషల్ టాక్ షోలు స్ట్రీమింగ్ చేస్తుండటం ఆహా ప్రత్యేకత. న్యూ వెర్షన్ తో వీక్షకులను ఆకట్టుకుంటున్న తెలుగు ఓటీటీ.. ఈ డిసెంబర్ లో బ్లాక్ బస్టర్ సినిమాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు (డిసెంబర్ 17) ఆహా వేదికగా "అనుభవించు రాజా" సినిమాని వరల్డ్ డిజిటల్ ప్రీమియర్ గా స్ట్రీమింగ్ చేశారు.యువ హీరో రాజ్ తరుణ్ - కషికా ఖాన్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'అనుభవించు రాజా'. శ్రీను గావిరెడ్డి ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ - శ్రీ వేంకటేశ్వర సినిమాస్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా రూపొందిన ఈ మూవీ నవంబర్ 26న థియేట్రికల్ రిలీజ్ కాబడి ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఆహా వేదికగా అలరించడానికి వచ్చింది.కథ విషయానికొస్తే.. పెద్దింట్లో పుట్టి పెరిగిన బంగారం అలియాస్ రాజు (రాజ్ తరుణ్).. తన తాత చివరి క్షణాల్లో చెప్పిన మాటలు విని అనుభవించు రాజా అంటూ జల్సారాయుడిగా మారతాడు. అనుభవించడానికే పుట్టానన్నట్టుగా కోడిపందేలు - పేకాట వంటి జూదాలు - సరదాలతో లైఫ్ ని ఎంజాయ్ చేస్తుంటాడు. అయితే ఊరికి ప్రెసిడెంట్ కావాలనుకున్న బంగారం.. ఎన్నికల హడావుడిలో ఓ హత్య కేసులో ఇరుక్కుంటాడు. ఆ హత్య ఎవరు చేశారు? ఊళ్లో జల్సాగా తిరిగే బంగారం సిటీలో సెక్యూరిటీ గార్డ్ ఎలా అయ్యాడు? హీరోయిన్ తో అతడి ప్రేమాయణం ఎలా సాగింది? హత్య కేసు నుంచి ఎలా బయటపడ్డాడా లేదా? అనేది 'అనుభవించు రాజా' కథ.థియేటర్లలో మంచి రెస్పాన్స్ తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు ఆహా ఓటీటీలో కూడా ఆకట్టుకుంటోంది. ఎనర్జిటిక్ పాత్రలకి పెట్టింది పేరైన రాజ్ తరుణ్.. బంగారం పాత్రలో ఓ జల్సారాయుడిలా చేసిన అల్లరి ప్రేక్షకులను అలరిస్తోంది. గోపీ సుందర్ సమకూర్చిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి.. చోటా కె ప్రసాద్ ఎడిటర్ గా వర్క్ చేశారు. ఈ సినిమాలో పోసాని కృష్ణమురళి - ఆడుకాలమ్ నరేన్ - అజయ్ - సుదర్శన్ - టెంపర్ వంశీ - ఆదర్శ్ బాలకృష్ణ - రవి కృష్ణ - భూపాల్ రాజు - అరియానా తదితరులు ఇతర పాత్రలు పోషించారు. జల్సాల గురించి.. పల్లెటూళ్ళు మరియు కుటుంబ బంధాలసందేశంఇస్తున్న 'అనుభవించు రాజా' సినిమా..ఆహా ఓటీటీలోరాబోయే రోజుల్లో ఎలాంటి వ్యూయర్ షిప్ తెచ్చుకుంటుందో చూడాలి.

# స్టార్ హీరో ప్రాజెక్టులో కీర్తి సురేష్... రూమరేనా?



'మహానటి' చిత్రంతో విలక్షణమైన నటిగా తెలుగు తమిళ భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకోవడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా పురస్కారాన్ని సైతం దక్కించుకుంది కీర్తి సురేష్. ఈ సినిమా తరువాత 'రంగ్ దే' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న కీర్తి ప్రస్తుతం వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా వుంది. సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'సర్కారు వారి పాట' మెగాస్టార్ చిరంజీవికి చెల్లెలిగా 'భోలా శంకర్' చిత్రాల్లో నటిస్తున్న కీర్తి సురేష్ .. నేచురల్ స్టార్ నానితో కలిసి 'దసరా'లోనూ మెరవబోతోంది.ఇదిలా వుంటే కీర్తి తమిళ స్టార్ ఇళయదళపతి విజయ్ చిత్రంలో నటిస్తోందంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తమ సినిమాలో కీర్తి సురేష్ నటించడం లేదని హీరో విజయ్ అఫీషియల్ టీమ్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. బిగిల్ (విజిల్) మాస్టర్ చిత్రాలతో వరుస విజయాల్ని సొంతం చేసుకున్నహీరో విజయ్ ప్రస్తుతం 'బీస్ట్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.అ మూవీ తరువాత వంశీ పైడిపల్లి చిత్రంలో నటించనున్నారు. విజయ్ 66వ ప్రాజెక్ట్ గా సెట్స్ పైకి రానున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ని కొన్ని నెలల క్రితమే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కానీ షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది? .. కాస్ట్ అండ్ క్రూ ఎవరన్నది వెల్లడించలేదు. అయితే ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన దగ్గరి నుంచి ఈ చిత్రంలో విజయ్ కి జోడీగా కీర్తి సురేష్ నటించనుందంటూ ప్రచారం మొదలైంది. ఆ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని విజయ్ చిత్రంలో కీర్తి సురేష్ నటించడం లేదని విజయ్ టీమ్ వెల్లడించింది.

# సూపర్ స్టార్...మార్చాలి గేర్

మహేష్ బాబు సూపర్ స్టార్. తండ్రి బిరుదునే కాదు ఆయన నటనా వారసత్వాన్ని కంటిన్యూ చేస్తూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నారు. మహేష్ బాబుది దాదాపుగా పాతికేళ్లకు చేరువ అవుతున్న కెరీర్. ఆయన తరువాతనే అల్లు అర్జున్ జూనియర్ ఎన్టీయార్ ప్రభాస్ రామ్ చరణ్ వచ్చారు. అయితే ఇపుడు



వీరంతా పాన్ ఇండియా స్టార్లు అయిపోయారు. ఒక్క లెక్కన జోరు చేస్తున్నారు. కేవలం తెలుగింట మాత్రమే కాదు పొరుగింట జే గంట మోగిస్తున్నారు. కెరీర్ లో పీక్స్ ని చూస్తున్నారు.మహేష్ బాబు కూడా ఎన్నో మంచి సినిమాలు చేశారు. బ్లాక్ బస్టర్ హిట్లు ఇచ్చారు. అయితే ఆయన కూడా పరిధి దాటి ఇండియన్ స్క్రీన్ ని టచ్ చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మహేష్ బాబు లో ఆ టాలెంట్ ఉంది. ఆయన బాడీ లాంగ్వేజ్ కూడా దానికి హెల్ప్ అవుతుంది అన్న సినీ మేధావుల విశ్లేషణలు ఉన్నాయి. మహేష్ బాబు హీరో అయిన కొత్తలో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఆయన చార్మింగ్ ఫేస్ ని చూసి టాలీవుడ్ కి కాదు హాలీవుడ్ కే సూపర్ డూపర్ హీరో దొరికాడు అని కితాబు ఇచ్చారు.మహేష్ బాబు మొదటి నుంచి అండర్ ప్లే యాక్టింగ్ ని ఎక్కువగా చేస్తారు. ఆయన పక్కా మాస్ హీరోగా ముద్రపడకపోవడానికి అదొక కారణంగా చెప్పుకోవచ్చు. ఊరికే అరుపులు కేకలు పెట్టడమే నటన కాదని భావాన్ని అంతర్లీనంగా పలికిస్తూ ఫేస్ లో వేయి ఎక్స్ ప్రెషన్స్ ని చూపించడమే మేలిమి నటన అని ఆది నుంచే అలవాటు చేసుకుని అనుసరిస్తూ వస్తున్న వారు సూపర్ స్టార్.మహేష్ బాబు బాలీవుడ్ లో అడుగుపెట్టాలంటే అది చిటికలో పనే. ఆయన శ్రీమతి బాలీవుడ్ కి చెందిన వారే. ఇక బాలీవుడ్ లో మంచి రిలేషన్స్ ఆయన సొంత బ్యానర్ పద్మాలయా సంస్థ కాలం నుంచి ఉన్నాయి. అయితే మహేష్ బాబు మాత్రం తెలుగునే ప్రేమిస్తూ ఇక్కడే సినిమాలు చేస్తూ వస్తున్నారు.సెట్స్ మీద ఉన్న సినిమా సర్కార్ వారి పాట కూడా పక్కా కమర్షియల్ మూవీ. అయితే మహేష్ స్టామినాకు కొలమానంగా ఈ తరహా సినిమాలు ఉండవు అని అంటున్నారు. ఆయన సైతం పాన్ ఇండియా మూవీ చేయాలని అంతా కోరుకుంటున్నారు. మహేష్ బాబు మరి వారి కోరిక ఆలకించారన్నట్లుగా రాజమౌళి తో మూవీ కమిట్ అయ్యారు. సర్కార్ వారి పాట తరువాత చేసేది అదే అయి ఉండవచ్చు.ఈ మూవీ తరువాత మహేష్ బాబు సైతం బాలీవుడ్ లో జెండా పాతేస్తాడు అన్న వారే ఎక్కువగా ఉన్నారు. ఇక సినిమా సినిమాకు గ్యాప్ తీసుకోకుండా వరసబెట్టి మహేష్ కమిట్ అవాలని కూడా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అదే విధంగా మాస్ ఓరియెంటెడ్ సబ్జెక్టులను మహేష్ బాబు ఎంచుకుంటే విరగదీయడం ఖాయమని అంటున్నారు. మొత్తానికి సూపర్ స్టార్ రేసులో దూసుకువచ్చేది రాజమౌళి మూవీతోనే అంటున్నారు. సో ఫ్యాన్స్ తో పాటు కామన్ ఆడియన్స్ కూడా వెయిటింగ్.

# "నాకు ఐపీఎల్‌లో ఆ జట్టుకు ఆడాలని ఉంది"




ఐపీఎల్-2022 సీజన్‌కు సంబంధించి మెగా వేలం జనవరిలో జరగనుంది. ఇప్పటికే ఆయా జట్లు రిటైన్ చేసిన ఆటగాళ్ల జాబితాను విడుదల చేశాయి. అదే విధంగా వచ్చే సీజన్‌లో లక్నో, అహ్మదాబాద్ రూపంలో మరో రెండు కొత్త జట్లు వచ్చి చేరాయి. ఇక రెండు జట్లు డిసెంబర్ 25లోపు వేలం పూల్‌కు వెళ్లిన ఆటగాళ్ల నుంచి ముగ్గురు ఆటగాళ్లను తీసుకోవచ్చు. కాగా చాలా మంది స్టార్ ఆటగాళ్లు మెగా వేలంలో ఉండడంతో ఈ సారి వేలంకు ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ క్రమంలో టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. వచ్చే సీజన్‌లో మళ్లీ చెన్నైసూపర్ కింగ్స్ జట్టు తరుపున ఆడాలని అశ్విన్ భావిస్తున్నాడు. అశ్విన్ తన ఐపీఎల్ కేరిర్‌లో 8 సీజన్లలో చెన్నైసూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. రానున్న మెగా వేలంలో సీఎస్‌కే తనని కొనుగోలు చేస్తుందని అతడు ఆశిస్తున్నాడు."సీఎస్‌కే నాకు బాగా దగ్గరైన ఫ్రాంచైజీ, సీఎస్‌కే నాకు ఒక స్కూల్ లాంటిది. అక్కడే నేను ప్రీ కెజి, ఎల్‌కెజి, యుకెజి, ప్రైమరీ చదివాను. ఆపై హైస్కూల్ చదువును కూడా ఇక్కడే ప్రారంభించి, 10 వ తరగతి పరీక్షలు పూర్తి చేసి, నేను వేరే కళశాలకు మారాను. నేను నా 11,12వ క్లాస్‌లను బయట పూర్తి చేసాను. కానీ ప్రతిదీ పూర్తి చేసిన తర్వాత, కచ్చితంగా ఎవరైనా ఇంటికి రావాలి?కాబట్టి నేను కూడా నా సొంత ఇంటికి(చెన్నైసూపర్ కింగ్స్) తిరిగి రావడానికి ఇష్టపడుతున్నాను. కానీ అది అంతా వేలంపై ఆధారపడి ఉంది" అని అశ్విన్ పేర్కొన్నాడు. ఇక ఐపీఎల్ ప్రారంభం నుంచి అశ్విన్ సీఎస్‌కేలో 2015 వరకు జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. అశ్విన్ చెన్నై తరుపున 94 ఇన్నింగ్స్‌లు ఆడి 24.2 సగటుతో 90 వికెట్లు పడగొట్టాడు.

## "పింక్ బాల్ టెస్టులో ఆడడం చాలా కష్టం"

యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతోన్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు మార్నెష్ లబూషేన్ అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. రెండో రోజు మ్యాచ్ అనంతరం విలేకరల సమావేశంలో మాట్లాడిన లబూషేన్ పలు విషయాలను వెల్లడించాడు. పింక్‌బాల్‌తో ఆడడం చాలా కష్టమని, అంత సులభంగా పరుగులు రాబట్టలేమని లబూషేన్ తెలిపాడు. పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్ ఆడడం చాలా భిన్నమైనదని, ఒక్కో పిచ్‌పై ఒక్కోలా పింక్ బాల్ ప్రవర్తిస్తుందని అతడు చెప్పాడు."పింక్ బాల్‌తో ఆడడం చాలా కష్టం. పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్.. సాధరణ టెస్ట్ మ్యాచ్ కంటే భిన్నంగా ఉంటుంది. మేము గతంలో ఇదే వేదికలో పాకిస్తాన్‌తో ఆడాము. అప్పుడు వికెట్‌పై కొంచెం గ్రాస్ ఉండడంతో పిచ్ చదునుగా ఉండేది. దీంతో బంతి అంత బౌన్స్‌గా కాలేదు. కానీ ప్రస్తుతం పిచ్‌పై ఎక్కువగా గ్రాస్ ఉండడంతో బంతి ఎక్కువగా బౌన్స్ అవుతోంది.దీంతో ఆడడం చాలా కష్టం అవుతోంది. రెండో రోజు ఆట ప్రారంభించినప్పుడు పరుగులు ఎలా సాధించాలో నాకు అర్థం కాలేదు" అని లబూషేన్ పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**